ప్రజాశక్తి
శుక్రవారం 4 ఏప్రిల్, 2025 5
శ్రీకాకుళం



ఒంటి పూట బడుల అమలు తప్పనిసరి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



శ్రీకాకుళం అర్బన్ : వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పాఠశాలల యాజమాన్యాలు నూరు శాతం ఒంటిపూట బడులు నిర్వహించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పేరిట రెండు పూటలు నిర్వహించడం సరికాదన్నారు. అటువంటి పాఠశాలలపై చర్యలు తప్పవన్నారు.

భారీగా చోరీ సొత్తు రికవరీ

- **37 తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం**
- **ఇద్దరు నిందితుల అరెస్టు**
- **ఎస్పి కె.వి మహేశ్వరరెడ్డి**



రికవరీ చేసిన బంగారు ఆభరణాలు చూపుతున్న ఎస్పి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో గురువారం భారీగా చోరి సొత్తు రికవరీ అయింది. జిల్లాతో పాటు విజయనగరం, విశాఖలో దొంగతనాలకు పాల్పడుతూ పట్టుబడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎస్పి కార్యాలయంలో గురువారం ఎస్పి కె.వి.మహేశ్వరరెడ్డి విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారంతో సిఐ తన సిబ్బందితో కలిసి నర్సిపురం రైల్వే గేట్ సమీపంలోని మాజీ సైనికోద్యోగుల కేంటీన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మోటార్ సైకిళ్లపై వస్తున్న పోల భాస్కరరావు, ముద్దాడ నరసింగరావు అనే ఇద్దరు వ్యక్తులను ఆపి విచారించారు. గతేడాది పలాసలో దొంగిలించిన బంగారు ఆభరణాలు అమ్మడానికి పలాస వస్తునట్లు గుర్తించారు. వీరిద్దరూ జిల్లాలో 16 చోట్ల, విశాఖ, విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన అనేక దొంగతనాల కేసుల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు సుమారు 40 లక్షల 2 వేల రూపాయలు విలువ గల 435.52 గ్రాములు (37 తులాల) బంగారు ఆభరణాలు, ఒక డైమండ్ బ్రేస్‌లెట్, ఒక డైమండ్ లాకెట్ స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు సుమారు రూ.26 వేలు విలువ గల 233.2 గ్రాముల (20 తులాలు) వెండి వస్తువులు, రూ.25 వేలు నగదు రికవరీ చేశారు. దొంగతనం చేసిన డబ్బులతో కొనుగోలు చేసిన ఒక మోటారు సైకిల్, ఒక స్కార్పియో వాహనాన్ని సీజ్ చేశారు. వీరు దొంగిలించిన ఆభరణములను ఒడిశా రాష్ట్రానికి చెందిన ముత్యాలు, విశాఖపట్నానికి చెందిన బోణి గోవిందరాజులు, మన్యం జిల్లా కు చెందిన గ్రంథి శ్రీనివాసరావు, ఎచ్చెర్లకు చెందిన పోలం కృష్ణకు ఇచ్చినట్లు చెప్పారు.

తాళాలు వేసిన ఇళ్లకు రెక్కీ

నిందితులు ఇద్దరూ ముందుగా ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని తాళం వేసిన ఇళ్లను గుర్తించి ఆ రోజు సాయంత్రం మోటారు సైకిళ్లపై వెళ్లి తాళాలు వేసిన ఇళ్లకు కొంత దూరంలో వాహనాలను పార్కింగ్ చేస్తారు. చేతికి గ్లౌజులు వేసుకుని, వారితో పాటు ఇనుప రాడ్, స్క్రూడ్రైవర్‌తో ఇంటి తలుపులను విరగ్గొడతారు. ఇంట్లోకి ప్రవేశించి బీరు తలుపులు విరగొట్టి అందులో ఉన్న బంగారు, వెండి వస్తువులు దొంగిలిస్తారు.

జైల్లో కలిసిన ఇద్దరు నిందితులు

పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతానగర్‌లోని అప్పయ్య సుగర్ ఫ్యాక్టరీ కాలనీలో తొమ్మిది సంవత్సరాల వయసులో ఓ ఇంట్లో దొంగతానికి పాల్పడుతూ పోల భాస్కరరావు దొరికిపోయాడు. మూడు నెలల పాటు విశాఖపట్నం అబ్జర్వర్ హోంలో ఉంచారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత నేరాలు చేయడమే అలవాటుగా మార్చుకున్నాడు. ఇతనిపై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో సుమారు 37 చోరీలు నమోదు కాగా, ఎనిమిది కేసుల్లో శిక్ష పడింది. శ్రీకాకుళంలోని ఓ బైక్ షోరూంలో పని చేసిన ముద్దాడ భాస్కరరావు బైక్ దొంగతనం చేస్తూ జైలుకు వెళ్లాడు. ఇతనిపై మూడు జిల్లాల పరిధిలో సుమారు 17 దొంగతనం కేసులు నమోదు కాగా, మూడింటిలో శిక్ష పడింది. విశాఖ సెంట్రల్ జైల్‌లో ఇద్దరికి పరిచయం ఏర్పడి అప్పడి నుంచి కలిసి తాళం వేసిన ఇళ్లలో రాత్రి పూట దొంగతనాలు మొదలు పెట్టారు.

ప్రతిభకు ప్రశంస

చోరి సొత్తు రికవరీ, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బి.సూర్యచంద్ర మౌళి, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, సిసిఎస్ ఎస్ఐ కె.మధుసూదనరావు, సిబ్బంది ఎస్.శ్యాంసుందరరావు, కె.భాస్కరరావు, ఎన్.విజయ్‌కుమార్, సిహెచ్.హరీష్, ఎస్.ఉషాకిరణ్‌ను ఎస్పి ప్రశంసించారు. కేసును పర్యవేక్షించిన అదనపు ఎస్పి (క్రైమ్) పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ డిఎస్పి వి.వి.వెంకటప్పారావుకు ఎస్పి అభినందనలు తెలిపారు.



ఎసిబికి చిక్కిన డిఎంహెచ్ఒ

తమ శాఖలోనే పనిచేస్తున్న ఓ ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ శ్రీకాకుళం జిల్లా డిఎంహెచ్ఒ డాక్టర్ తెన్నేటి బాలమురళీకృష్ణ గురువారం ఎసిబి అధికారులకు రెడ్ హేండెడ్‌గా పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్పి రమణమూర్తి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి...

వార్త మెయిన్‌లో....

'ఉపాధి' పనుల్లో భాగస్వాములు కావాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రానున్న వేసవిలో సాగునీటి కాలువల పునరుద్ధరణ, తాగునీటి, సాగునీటి చెరువుల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టేందుకు వీలుగా డ్వామా, నీటి పారుదల, భూగర్భజల వనరుల శాఖలు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో ఈ మూడు శాఖల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనులు గుర్తించే సమయంలో అత్యవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవసరం లేనిచోట పనులు చేపట్టడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. అందుకే భూగర్భ జలాలను పెంపొందించేందుకు వీలుగా పనులు గుర్తించాలన్నారు. ప్రత్యేక అవసరాలను, ఇంతకు ముందెప్పుడూ పట్టించుకోకుండా విడిచిపెట్టిన వాటిపై దృష్టిసారించాలన్నారు. ఇంకుడు గుంతలు, పశుపక్ష్యాదుల కోసం నీటి కుంటలు ఏర్పాటుపై లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా చెక్‌డ్యామ్‌లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేయాలన్నారు. పనుల్లో ప్రజల అవసరనాలే ప్రామాణికం కావాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ బి.సుధాకరరావు, నీటిపారుదలశాఖ ఇఇ సుధాకర్, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఎస్ఇగా రవి



రవి, ఎస్ఇ

శ్రీకాకుళం అర్బన్ : పంచాయతీరాజ్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా గిద్దలూరి రవిని గురువారం ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఇఇగా పనిచేస్తూ పూర్తి అదనపు బాధ్యతల్లో ఆయన నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్ఇగా ఉన్న ఎం.శ్రీనివాస్ స్థానంలో ఆయనను ప్రభుత్వం నియమించింది. జెడ్‌పి ఆవరణలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన ఎస్ఇగా బాధ్యతలు చేపట్టారథీ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు.



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి- గుజరాతీపేట

అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరిసరాలైన శాంతి నగర్ కాలనీ, బలగ తదితర నాగావళి నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాల్లో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో గురువారం డ్రోన్ నిఘా పెట్టామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేస్తున్నామని తెలిపారు. చివర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్ తడితర నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి పాడుపడిపోయిన బంగ్లాలు, నివాసగృహాలపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిరించామన్నారు. బహిరంగంగా మద్యం, గంజాయి తాగుతూ పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

పర్యవేక్షించిన ఆర్‌జెడి విజయ భాస్కర్



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జెడి విజయ భాస్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పదో తరగతి పేపర్ల దిద్దుబాటు గురువారం ప్రారంభమైంది. పరీక్ష మొదలైన తర్వాత కుప్పిలి మోడల్ స్కూల్లో మాస్‌కాఫీయింగ్ పేరిట ఉపాధ్యాయుల సస్పెన్షన్, విద్యార్థుల డిబార్‌తో వివాదం మొదలైంది. ఉద్దేశపూర్వకంగా ఈ కేంద్రంలో డిఇఒ తిరుమల చైతన్య తనిఖీల పేరుతో గందరగోళాన్ని సృష్టించారంటూ ఉపాధ్యాయులు ఆందోళనబాట పట్టారు. పరీక్షలు పూర్తయినప్పటికీ వివాదం సమసిపోకపోవడంతో మూల్యాంకాన్ని బహిష్కరిస్తామని ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. దీంతో ఉన్నత స్థాయిలో గుబులు మొదలై ఇద్దరు మినహా మిగిలిన ఉపాధ్యాయుల సస్పెన్షన్లను ఉపసంహరించుకున్నారు. అలాగే క్రిమినల్ కేసులను సైతం ఉపసంహరించుకుంటామంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులతో బుధవారం చర్చించారు. ఉపాధ్యాయుల డిమాండ్లపై కలెక్టర్ సానుకూలంగా స్పందించడం, డిఇఒపై రాష్ట్రస్థాయిలో విచారణ మొదలు కావడం, మూల్యాంకన విధుల నుంచి ఆయనను తప్పించడంతో ఉపాధ్యాయులు శాంతించారు. అందులో భాగంగా గురువారం పదో తరగతి మూల్యాంకనం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, శ్రీచైతన్య టెక్నో స్కూల్ కేంద్రాల్లో ప్రారంభమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు డిఇఒ మూల్యాంకనానికి దూరమయ్యారు. ఆయన స్థానంలో పర్యవేక్షణ బాధ్యతలను ఆర్‌జెడి విజయభాస్కర్‌కు అప్పగించారు. దీంతో ఆయన పర్యవేక్షణలో మూల్యాంకనం ప్రారంభమైంది. దీంతో ఉపాధ్యాయులు విధుల్లో నిమగ్నమయ్యారు.

పోషక భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళలకు పోషకభద్రతపై పూర్తి అవగహన కలిగి ఉండాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన కుటుంబాన్ని నడిపించగలరని కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. నైర వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యాన ఎస్.ఎస్.వలసలో గురువారం రెండో రోజు నిర్వహించిన జాతీయ సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేల పరిరక్షణ, నేల పరీక్షలు, మహిళలకు పోషక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్న ఆశతో రైతులు ఎక్కువ మంది రసాయనాలను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారని, ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల నేలతో పాటు తినే ఆహారం వరకు కలుషితమవుతున్నాయని అన్నారు. ప్రధానంగా మహిళలు, గర్భిణులు దీనివల్ల తీవ్ర భావితులు అవుతున్నారని అన్నారు. పోషక భద్రత పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. శాస్త్రవేత్త, అధ్యాపకులు డాక్టర్ గురుమూర్తి నేలను సంరక్షించుకునే పద్దలతులను వివరించారు. నేలకు సేంద్రీయ ఎరువులు వాడకం పెంచడం వల్ల సారవంతం కాగలదరన్నారు. పంట పండించే ముందు నేల పరీక్ష తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ జగనాథం మాట్లాడుతూ భూమి ఆరోగ్యం క్షీణించడం వల్ల తినే ఆహారంపై ప్రభావం చూపుతుందన్నారు. గడచిన మూడు దశాబ్దాల కాలంలో భూసారం ఎలా దెబక్కతింటుందో గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి కొర్ని జోగులు, వ్యవసాయ కళాశాల ఎన్‌సిసి అధికారులు డాక్టర్ గోవిందరావు, స్పందన, పురుషోత్తం పాల్గొన్నారు.

పెన్షనర్లపై చిన్నచూపు తగదు



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ వ్యాప్తంగా పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వ పరిధిలో సుదీర్ఘకాలం పాటు సేవలందించిన ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఉద్యోగ, పెన్షనర్లను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన పెన్షనర్ల సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా కేంద్రం లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు ప్రసాదరావు, వెంకటరావు పాణిగ్రహి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పని చేయడం ద్వారా సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలన్నారు. పార్లమెంట్ సభ్యులుగా ప్రజలు ఎన్నుకున్న వారికి పారితోషకాల పేరుతో రూ.లక్షలు ప్రతినెలా చెల్లిస్తున్న ప్రభుత్వం, ఉద్యోగులకు దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించి విశ్రాంత తర్వాత పెన్షనర్లకు మాత్రం అన్యాయం చేస్తోందన్నారు. పెన్షన్ రివిజన్‌ను చేపట్టకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారన్నారు. దీనికి తోడు లోపభూయిష్టమైన పెన్షన్ సవరణ బిల్లును తీసుకొచ్చి పార్లమెంట్‌లో ఆమోదించడం వెనుక అంతార్యన్ని ప్రశ్నించారు. పెన్షనర్లకు నష్టదాయకమైన సవరణ బిల్లు తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 14 ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. సవరణ బిల్లు ఉపసంహరించుకునేంత వరకు దశల వారీ పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.ఎస్.ప్రసాదరావు, ఎం.పాపారావు, మన్మథరావు, ఎం.వి.రామారావు, పాణిగ్రహి, మాతల గోవర్ధనరావు, కె.గోపాలరావు, హెచ్.ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద, డిఎస్పి

రాత్రి 11 తరువాత సంచరిస్తే చర్యలు

డిఎస్పి వివేకానంద

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరం పరిధిలో ఎటువంటి కారణం లేకుండా అర్థ రాత్రుళ్ల బహిరంగంగా తిరిగిన వారిపై కేసులు తప్పవని శ్రీకాకుళం టౌన్ డిఎస్పి సిహెచ్.వివేకానంద్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నేర నియంత్రణ చర్యల్లో భాగంగా రాత్రి సమయాల్లో గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించే నమయాల్లో ఏటువంటి కారణాలు లేకుండా తిరుగుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు నేర నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని హెచ్చరించారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీశీకాకుళం సబ్ డివజన్ పరిధిలో రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, కొన్ని ముఖ్యమైన కూడళ్లలో నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా వారిపై టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టుబడిన వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామన్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు నగర ప్రజలు పోలీసుకు సహకరించాలన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామకపు ప్రక్రియ నిలిపివేత

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు భర్తీ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు జెసి ఫర్మాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26న నోటిఫికేషన్ ఇచ్చామని, పాలనా కారణాల వల్ల ఈ నియామకాలను నిలిపి వేస్తున్నట్టు తెలిపారు.

మే 8, 9న సిపిఐ జిల్లా మహాసభలు

సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకటరమణ

సోంపేట : సోంపేటలో మే 8, 9 తేదీల్లో సిపిఐ 25వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోంపేటలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జీడి 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలన్నారు. గత కొంతకాలంగా జీడి రైతాంగం దశలవారీగా పోరాటాలు చేస్తున్నా... పాలక ప్రభుత్వాలు స్పందించడం లేదని అన్నారు. ఈ సీజన్‌లోనే జీడికి రూ.16 వేలు ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాగా ప్రకటించి 1/70 చట్టం అమలు చేయాలన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు గిరిజనులు సాగులో ఉన్న బంజర భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిఒ నంబరు 3 అమలు చేయాలన్నారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలన్నారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వంశధార రిజర్వాయరు పనులు పూర్తిచేసే చివరి భూములకు నీరు అందించాలన్నారు. వంశధార కాలువను ఆధునికీకరించి కాలువకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎమ్మెల్యే గౌతు శిరీష



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ న్యూ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.20 లక్షల వ్యయంతో సరఫరా చేయనున్న నీటి ట్యాంకులకు గురువారం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతు న్నా... గత ప్రభుత్వం పట్టించుకో లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి ప్రాధాన్యతగా తాగునీటిపైనే దృష్టిసారించిందన్నారు. ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నుంచి పలాస-కాశీబుగ్గ పట్టణాలకు వేసవిలో తాగునీరు అందిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మరోవైపు పనులు చేపడుతున్నామని అన్నారు. తాగునీరు కోసం మహిళలు ఇబ్బందులు పడనవసరం లేదన్నారు. ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నుంచి నీరు వచ్చే వరకు మున్సిపల్ వీధులకు రోజుకు 24 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. పలాస ప్రాంతానికి 12 ట్యాంకులు, కాశీబుగ్గ ప్రాంతానికి 12 ట్యాంకుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసే సమయంలో మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయం చేస్తూ సక్రమంగా నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, వార్డు ఇన్‌ఛార్జి కొత్త సత్యం, చెల్లూరు రామకృష్ణ, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, కమిషనర్ ఎన్.రామారావు, మున్సిపల్ డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పట్టణ రూపురేఖలే మారుస్తా

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, తాళభద్ర, రాజాం కాలనీ, పెద్ద బ్రాహ్మణ వీధి, నీలాపురం, నర్సిపురం తదితర ప్రాంతాల్లో గురువారం రూ. 34 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

మురుగు సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలం కేంద్రంలోని అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై ఐదేళ్లుగా నిలిచిన మురుగు నీటి సమస్యపై తక్షణమే అధికారి యంత్రాంగం పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం, గత పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలిచిపోయిందన్నారు. అప్పటి నుంచి వాహనదారులు, పాదచారులు ఈ మార్గం నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనేక ప్రమాదాలు చోటుచేసుకుండడంతో గాయాలు పాలై ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. దోమల విజృంభించి అనారోగ్యానికి రవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది అక్టోబరు 3న స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రజాదర్బార్ సందర్భంగా ఈ రహదారిని పరిశీలించి పరిష్కరిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. అయినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. పాలకులు, అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైశ్యరాజు పైడిరాజు, శ్రీను, రామరాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

రీ సర్వేతో రైతులకు మేలు

పలాస: వ్యవసాయ భూములను ఫేజ్‌లో రీ సర్వే చేస్తున్నామని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. మండలంలోని కిష్టుపురంలో గురువారం ఫేజ్-2 రీ సర్వేను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస డివిజన్ పరిధిలో మొదటి పేజ్‌లో ఏడు గ్రామాలను రీ సర్వే చేశామని అన్నారు. రెండో ఫేజ్‌లో 14 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే ప్రారంభించామని చెప్పారు. మరో మూడు నెలల్లో డివిజన్ పరిధిలోని 14 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయ భూములకు రీ సర్వే చేయడం ద్వారా రైతులకు ఉపయోగకరమన్నారు. తప్పులు, ఒప్పులు ఉంటే రీ సర్వేలో సరి చేసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ వాయిలపల్లి సునంద, మండల సర్వేయర్ గిరి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే దృష్టికి గ్రామ సమస్యలు

మెళియాపుట్టి: మెళియాపుట్టిలోని సమస్యలను పరిష్కరించాలని మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లోని ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారని అన్నారు. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. పొందరవీధిలో తాగునీటి వాటర్ స్కీమ్ మరమ్మతులు చేయాలన్నారు. ముస్లిం, పొందరవీధుల్లో కాలువలను నిర్మించాలని విన్నవించారు. వీటిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈయనతో వార్డుమెంబర్ కాళ్ల వేణు ఉన్నారు.



ఎంపికైన విద్యార్థులు

'ఐతమ్' విద్యార్థుల ఎంపిక

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఇ, ఐటి, ఇసిఇ, సిఎస్ఎం కోర్సులను 2025 విద్యాసంవత్సరంలో పూర్తిచేసిన ఎనిమిది మంది విద్యార్థులు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న క్రాల్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎల్ఎల్పి (లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్షిప్) కంపెనీలో ఉద్యోగాల కోసం ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఎంపికైన అభ్యర్థులకు అభినందించారు. వార్షిక వేతనంగా ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఆ కంపెనీ చెల్లిస్తుందని పేర్కొన్నారు. అంకిత భావంతో విధులను నిర్వహించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ .శ్రీనివాసరావు, హెచ్‌డిలు, టిపిఒ డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో నాలుగు కొలువులు

సరుబుజ్జిలి: మండలంలోని షలంత్రి గ్రామ పంచాయతీ మర్రిపాడుకు చెందిన వాకముల్లు బాలమురళీ నాలుగు నెలల్లో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. తండ్రి రమణమూర్తి న్యాయవాదికాగా తల్లి జానకి గృహిణి. ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు నవీన్ ఇప్పటికే ఏడాదికి రూ.కోటి ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో రాణిస్తున్నాడు. పెద్ద కుమారుడు బాలమురళీ బీటెక్ పూర్తి చేసి బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణ పొందాడు. 2020లో విడుదలైన రూరల్ బ్యాంక్ ఆర్ఆర్‌బి పిఒ క్లర్క్ ఫలితాల్లో ఉత్తీర్ణుడై ప్రస్తుతం చైతన్య గోదావరి బ్యాంకులో పిఒగా విధులు నిర్వహిస్తున్నాడు. వీటితో పాటు ఇటీవల విడుదలైన ఐబిపిఎస్ పిఒతో పాటు క్లర్క్ ఉద్యోగానికి కూడా అర్హత సాధించాడు. అలాగే బుధవారం విడుదలైన ఆర్‌పిఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. బాలమురళీ ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు రమణ మూర్తి, జానకితో పాటు మర్రిపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



బాలమురళికి అభినందనలు తెలుపుతున్న తల్లిదండ్రులు

సోంపేటకు ప్రత్యేకం 'ఉటంకీలు'

ఉద్దానం ప్రాంతం అంటే కొబ్బరి పంట, మందస అంటే కోవా, పలాస అంటే జీడిపప్పు, కాకినాడ అంటే కాజా గుర్తుకు వస్తాయి. అలాగే సోంపేటకు ఉటంకీలు అనే తీపి వంటకం ప్రత్యేకతను తీసుకు వచ్చింది. గత 30 ఏళ్లుగా కేవలం సోంపేట పట్టణంలోని లభ్యమయ్యే ఈ ఉటంకీలు, అన్ని శుభకార్యాల్లో ప్రత్యేక వంటకంగా పేరు గాంచింది స్నేహితులు గాని బంధువులు గాని తమ ఇళ్లకు వచ్చినప్పుడు తప్పనిసరిగా సోంపేటలో ఉండే వారంతా వాళ్లకి వీటిని ఇచ్చి పంపించడం ఆనవాయితీగా మారిందంటే అతిశయోక్తి కాదు. అంతలా ఈ తీపి వంటకం పేరుగాంచింది.

- సుదూర ప్రాంతాలకు రవాణా
- శుభకార్యాల్లో ప్రత్యేకత

చాటుతున్న తీపి వంటకం

ప్రజాశక్తి-సోంపేట

సోంపేట పట్టణానికి చెందిన కింతలి శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు 30 ఏళ్లుగా ఈ ఉటంకీలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాసరావును అందరూ ఉటంకి శ్రీనుగా పిలుస్తున్నారు. అంటే ఈ వంటకం ఎంతగా ప్రాచుర్యం పొందిందో అర్థమవుతుంది. తమ పూర్వీకులు కింతలి ధనలక్ష్మి, కింతలి వెంకటగిరి విజయనగరం జిల్లా గుమలక్ష్మీపురంలో ఉంటూ ఈ ఉటంకీ అనే వంటకాన్ని తయారు చేస్తూ... జీవనం సాగించేవారని తెలిపారు. అప్పట్లో ఒక్కొక్కటి రూపాయిన్నర ఉండగా కాలక్రమంలో ధర పెరుగుతూ ప్రస్తుతం ఒక్కోటి రూ.18 ఉందని తెలిపారు. పండగల సమయంలోను, శుభకార్యాల సమయాల్లో వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారని శ్రీనివాసరావు తెలిపారు. తమ దంపతులతో పాటు మరో ఇద్దరు కార్మికులను వినియోగించుకొని రోజుకి వెయ్యి ఉటంకిలను తయారు చేస్తూ ఉన్నామని తెలిపారు. ఖర్చులు పెట్టుబడి పోను నెలకు రూ.20 వేలు వరకు ఆదాయం సమకూరుతుందని దాంతో జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు ప్రభుత్వం చేయూత అందిస్తే దీన్ని ఒక పరిశ్రమగా రూపొందించి, నలుగురికి నేర్పించాలని అనుకుంటున్నట్లు వారు తెలిపారు.



ఉటంకీలను తయారు చేస్తున్న కార్మికులు



విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఉటంకీలు

ఉటంకీలు తయారీ ఇలా...

ఉటంకీలు తయారు చేసేందుకు బియ్యం, పంచదార, పాలు, రిఫండ్ ఆయిల్ అవసరమవుతాయని తెలిపారు. బియ్యం నానబెట్టిన తర్వాత పిండిగా చేసి వాటిని ప్రత్యేకమైన పద్ధతిలో ఉటంకల ఆకారంలోకి చేస్తామని తెలిపారు. బియ్యం పిండి పంచదారను సమపాళ్లలో కలిపిన తర్వాత ప్రత్యేకమైన రుచి కోసం మరికొన్ని పదార్థాలను అదనంగా చేర్చామని తెలిపారు. ఇలా తయారు చేసిన ఉటంకీలు ఆరబెట్టిన అనంతరం నూనెలో చేస్తున్నారు. తినేవారి ఆరోగ్యాని దృష్టిలో ఉంచుకొని ఒకసారి ఉపయోగించిన నూనెను మరోసారి ఉపయోగించకుండా ఉంటామని తెలిపారు. తయారు చేసిన ఉటంకిలను జాగ్రత్తగా నిల్వ చేస్తే ఐదు నెలల వరకు పాడవకుండా ఉంటాయని తెలిపారు అందుకే వీటిని సుదూర ప్రాంతాలకు సైతం తరలించే ందుకు వీలు కలుగుతుందని అన్నారు.

చేయూతందిస్తే మరింత అభివృద్ధి

తమకు వస్తున్న కొద్దిపాటి ఆదాయంతో ఉటంకీలను తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని కింతలి శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీ రుణం అందించి చేయూత అందిస్తే ఉటంకీల తయారీని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసి, మరి ఎంతోమందికి ఉపాధి అందించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు.



దీక్షల్లో పాల్గొన్న ప్రొఫెసర్ విష్ణుమూర్తి

కుల ధ్రువీకరణ తప్పనిసరి

కవిటి: తమ బిడ్డల ఉన్నత చదువులు, యువతీ యువకుల ఉద్యోగాన్వేషణ కోసం తమకు తప్పనిసరిగా తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిందేనని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. అంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 463వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా గురువారం దీక్షలో ప్రొఫెసర్ విష్ణుమూర్తి పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో బెంతు ఒరియా విద్యార్థులు నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది ఈ విషయంలో సానుకూలంగా స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షలో సుమన్ బిసాయి, బృందావన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం తనిఖీ

ఇచ్ఛాపురం : స్థానిక సబ్ పోస్టాఫీసును జిల్లా పోస్టల్ అధికారి వి.హరిబాబు గురువారం వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యం కోసం అదనంగా కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఖాతాదారుల పుస్తకం ప్రింటింగ్‌కు కొత్తగా ప్రింటర్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలో స్థానిక పోస్టాఫీసులో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 1,70,000 ఖాతాలు తెరిచామన్నారు. స్థానిక పోస్టాఫీసు భవన మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈయనతో పాటు శ్రీకాంత్ జ్ఞానేశ్వరి, సిబ్బంది ఉన్నారు.



తనిఖీ చేస్తున్న హరిబాబు

ఊయల పథకం ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

అనాథ పిల్లలను ప్రభుత్వం సంరక్షిస్తుందని, ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్తానిక ప్రభుత్వాస్పత్రిలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పసి పిల్లల ఊయల పథకాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగవైకల్యంగా జన్మించినా, పసి పిల్లలను విడిచి పెట్టి వెళ్లిపోవాలని అనుకున్న తల్లులు ఊయల పథకం ద్వారా సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే వారి బాగోగులు ప్రభుత్వమే చూసు కుంటుందన్నారు. ఎవరికైనా అనాథ పిల్లలను దత్తత తీసుకోవాలంటే కేరా యాప్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. దత్తత తీసుకోనే కుటుంబ సభ్యుల ఆర్థిక, ఆరోగ్య పరిస్థితుల వివరాలను సేకరించి అనంతరం దత్తత ఇస్తారని చెప్పారు. దత్తత ఇచ్చిన రెండేళ్ల వరకు శిశు గృహాల అధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా అంగవైకల్యం, అనాథ పిల్లలకు ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ పార్వతి, సూపర్‌వైజర్లు యు.లత, గంగమ్మ, సరస్వతి, ధనలక్ష్మి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, ఎం.నరేంద్ర, వైద్యులు మేఘన, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



ఊయలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

చలివేంద్రాల ఏర్పాటు

వేసవి సమీపిస్తున్న తరుణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అవసరమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్, కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో మున్సిపాలిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, కమిషనర్ ఎన్.రామారావు, దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నియోజకవర్గం పరిధిలో అనేక రకాల వనరులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగ పర్చడానికి అధికారులు పూర్తి సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో కొత్తగా ఏ మంజూర్లు ఇచ్చినా అందులో శ్రీకాకుళం నియోజక వర్గం ఉండే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని సిపిఒను కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చడానికి నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని, ఈ జాబ్‌మేళాలో వేలమంది యువతకు అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వికలాంగుల కోసం కొన్ని కంపెనీల్లో అవకాశాలు ఉండాలన్నారు. ఎకనామిక్ అండ్ స్టాటిస్టిక్స్‌పై ఎప్పటికప్పుడు నివేదికలను తయారు చేయాలన్నారు. నియోజకవర్గంలో టెంపుల్ టూరిజం కోసం ప్రయత్నిస్తోందని, ఇందులో కళింగ పట్నం బీచ్, అరసవల్లి, శ్రీకూర్మంతో పాటు సాలిహుండం బౌద్ధ ఆరామం వంటి వాటిని చేర్చడం జరుగుతుందన్నారు. ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సమావేశంలో సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, టూరిజం అధికారి నారాయణరావు, స్పోర్ట్స్ అధికారి శ్రీధర్, ట్రైబుల్ వెల్ఫేర్ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి సుదర్శనరావు, వికలాంగులశాఖ ఎడి కె.కవిత, నెహ్రూ యువ కేంద్రం డిడి వెంకట్ ఉజ్వల్, అధికారులు పాల్గొన్నారు.

షాపుల తనిఖీ

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని పలు కిరాణా షాపులు, పాన్ షాపులు, టీ, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, స్వీట్ బేకరీలను ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి కె.లక్ష్మి గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. కిరాణా పాన్ షాప్‌ల్లో ఆహార పదార్థాలు ప్రజలకు విక్రయించే వాటిని ఎక్స్పైరీ డేట్లు, వాటికి వినియోగించే కెమికల్స్ తాలూకా వివరాలు పరిశీలించారు. నిషేధించిన ఆహార పదార్థాలు ప్రజలకు విక్రయిస్తే షాపులో యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు పెట్టి షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం మండలంలో నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయించినా, తయారీ చేసినట్లు సమాచారం వస్తే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, డాబాలు వద్ద చికెన్, మటన్ ఇతర వేజ్, నాన్‌వెజ్ తో తయారు చేసిన ఆహార పదార్థాల్లో ప్రజలకు హానిచేసే రంగులు, చైనా సాల్ట్‌లు వినియోగించరాదన్నారు.



సరుకులను పరిశీలిస్తున్న వెంకటరత్నం

సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



కవిటి : ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న 50 శాతం సబ్సిడీ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులకు బ్యాంక్ అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పురపాలక సంఘంలోని 23 వార్డులకు 69 యూనిట్లు మంజూరుకాగా 489 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. బిసి, ఇడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరైన రుణాలకు బ్యాంకు అధికారులతో కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని ఎంపికైన అభ్యర్థులు సబ్సిడీ రుణాలతో యూనిట్లను సక్రమంగా నిర్వహించి ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ, ఎపిజివిబి, కెనరా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి, డిసిసి బ్యాంక్ మేనేజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: బిసి కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని కవిటి, శిలగాం స్టేట్ బ్యాంకులు, కవిటి - బొరివంకలోని ఎపిజివిబి బ్యాంకులు, రాజపురం యూనియన్ బ్యాంకు మేనేజర్లు లబ్ధిదారుల రుణ అర్హతలు పరిశీలించి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీవాసరెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 700 దరఖాస్తులు వచ్చాయని, కానీ, మండలానికి 82 మాత్రమే బిసి రుణాల మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎపిఎం గోవిందరావు, కార్యదర్శి అబ్దుల్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

పలాస: రాష్ట్ర ప్రభుత్వం బిసిల అభ్యున్నతికి కృషి చేస్తుందని, అందులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తామని ఎంపిడిఒ కె.వసంతకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బిసి కార్పోరేషన్ ధరఖాస్తులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం 427 ధరఖాస్తులకు, సుమారు 230 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మండల పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, ఎఒ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు, జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

విద్యకు పెద్దపీట

పోలాకి: కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన వార్షికోత్సవ కార్యక్రమం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మధ్యాహ్న భోజన మెనూలో పలు మార్పులు తీసుకొచ్చి విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. నియోజకవర్గ సమన్వ యకర్త బగ్గు అర్చన, హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పొందూరు

మండలం గోకర్ణపల్లిలో విద్యుత్ సమస్యలపై సిజిఆర్‌ఎఫ్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం విద్యుత్‌శాఖ ఎఇ వి.సుధీర్ విద్యుత్ సమస్యలు పరిశీలించారు. గ్రామంలో లోఓల్టేజీ సమస్యతో పాటు, ఇళ్లపైన హైటెన్షన్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయంటూ సిజిఆర్‌ఎఫ్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో లోఓల్టేజీ పరిష్కరించడంతో పాటు హైటెన్షన్ వైర్లను ఇళ్లపై నుంచి తొలగించేందుకు చర్యలు చేపడతానన్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, నీటి సంఘం ప్రెసిడెంట్ జి.రాము, సబ్ ఇంజనీర్ రమణ మూర్తి, అసిరినాయుడు తదితరులున్నారు.

రీ సర్వేపై అవగాహన

నందిగాం : మండలంలోని శివరాంపురం పంచాయతీ ముజ్జవాడలో తహశీల్దార్ పి.సోమేశ్వరరావు రీ సర్వేపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిటి ఆర్.రామారావు, మండల సర్వేయర్ హనుమంతరావు, విఆర్‌ఒ ఎం.మురళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందిగాం : నందిగాం వద్ద జాతీయ రహదారిపై గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. జలుమూరు మండలం కరవంచకు చెందిన ఎస్.రవికిరణ్ (38) పలాసలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు గురువారం ఉదయం విధులకు బైక్‌పై వస్తుండగా నందిగాం వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పై డివైడర్‌ను ఢీకొన్నాడు. వెంటనే రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. హెచ్‌సి రమణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పొందుతున్న అప్పన్న

ఆర్మీ జవాన్ దాడి

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన పంచాయతీ గంగుపేటకి చదునుపల్లి రాము అనే ఆర్మీ జవాన్ అదే గ్రామానికి చెందిన చదునుపల్లి అప్పన్న, ఆయన కుమారుడు హరిబాబుపై గురువారం కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. వివరాల్లోకి వెళ్తే... అప్పన్నకు అన్న కుమారుడైన రాముకు ఇటీవల భూవివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో గురువారం వీరు ఇరువురు మధ్య మాటమాట పెరిగి రాము ఆకస్మత్తుగా కత్తితో అప్పన్నపై దాడి చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అప్పన్న కుమారుడు హరిబాబు అడ్డగించే ప్రయత్నం చేశారు. ఆయనపైనా దాడి చేసి గాయపరిచారు. గ్రామస్తులు కలుగచేసుకొని గాయపడిన తండ్రీకొడుకులను 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ వి.సత్య న్నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడిని అరెస్టు చేసిన ఎస్ఐ

గంజాయితో వ్యక్తి అరెస్టు

సోంపేట : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని గురువారం కొర్లాం జాతీయ రహదారి వద్ద అరెస్టు చేశామని బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. బిప్రా దొలాయి అనే వ్యక్తి ఒడిశా నుంచి సుమారు కిలో గంజాయిని బాపట్ల జిల్లాకు తరలిస్తున్నాడని అన్నారు. గంజాయి అక్రమ రవాణాపై దృష్టిసారించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఈత చెట్లు దగ్ధం

కోటబొమ్మాళి: స్థానిక మెయిన్‌రోడ్డులో పి.రాంబాబుకు చెందిన రెండు ఈత చెట్లు గురువారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. ఖాళీ స్థలంలో పారిశుధ్యం నిర్వహించి అ చెత్తను ఈత చెట్లుకు సమీపంలో నిప్పుపెట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. చెత్తకు నిప్పుపెట్టి వారు ఇంటికి వెళ్లిపోయిన కొద్ది నిమషాలకు కాలుతున్న నిప్పురవ్వలు ఈత చెట్లుకు పైకి ఎగసిపడి రాజుకొని దగ్ధమయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి పి.ఆర్.రెడ్డి, తన సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.



చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి

కొండగొర్రెపై కుక్కల దాడి

పలాస: అడవిలో తప్పిపోయి జనావాసాల్లోకి వచ్చిన ఓ కొండగొర్రెను గురువారం కుక్కలు గాయపరిచాయి. సమాచారం అటవీశాఖ సిబ్బంది దాన్ని రక్షించి పశు వైద్యశాలలో సపర్యలు చేశారు. తీవ్ర ఎండలు కారణంగా నీటికోసం కాశీబుగ్గ సమీప పంట పొలాల్లోకి ఓ కొండ గొర్రె వచ్చింది. దాన్ని చూసిన కుక్కలు కరవడంతో నేరుగా కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయం ఆవరణలోకి దూకి ప్రాణరక్షణ కోసం విలవిలాడింది. విషయం తెలుసుకున్న ఈస్ట్రస్వీట్ వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుడు ఓంకార్‌రెడ్డి, కాశీబుగ్గ అటవీశాఖ సిబ్బంది కృష్ణారావు, రాజు సంఘటన స్థలానికి చేరుకొని కొండగొర్రెను అతికష్టంపై పట్టుకున్నారు. తోక, తొడలు, వెనుకకాలు భాగంలో కుక్కలు తీ వ్రంగా కరిచి గాయాలు చేసినట్లు గుర్తించారు. పశువైద్యాధికారులు గాయాలైన చోట కుట్లు వేసి మందులు వేశారు. వారం రోజుల పాటు ఆస్పత్రి ఆవరణలోనే ప్రత్యేక పర్యవేక్షణలో గొర్రెను సంరక్షిస్తామన్నారు. అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ గాయాలు పూర్తిగా నయమైన తరువాత అడవిలో తిరిగి విడిచిపెడతామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వజ్రపుకొత్తూరు: విద్యుత్ లైన్ల బ్రేకర్స్ కొత్తగా ఏర్పాటు చేస్తున్న సందర్భంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఇఇ యజ్ఞేశ్వం రావు ఒక ప్రకటనలో తెలిపారు. పుండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. పూండి, పెద్దమురహరిపురం, అమలాపాడు, దేవున ల్తాడ, పొల్లాడ గ్రామస్తులు సమకరించాలని కోరారు.

నాగార్జున పరామర్శ

లావేరు: మండల తెలుగు యువత అధ్యక్షుడు అప్పాపురం మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్‌ను విజయనగరం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున పరామర్శించారు. మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాళ్లు విరిగి పోవడంతో ఆపరేషన్ జరిగి ఇటీవల ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకుని కోలుకుంటున్న విషయం తెలుసుకున్న నాగార్జున మహేష్‌ను పరామర్శించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రెడ్డి శంకర్‌ను పరామర్శించారు. ఈయనతో తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ మోహన్, బాసిన దాలిరాజు, గ్రామస్తులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

ఎంవిఐ కార్యాలయం పలాసలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి- పలాస

ఎంవిఐ కార్యాలయాన్ని పలాసలోనే కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ల గౌరవాధ్యక్షుడు, టిడిపి నాయకుడు దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యాన ఆటో కార్మికులంతా ఎమ్మెల్యే శిరీషను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆటో ఫిట్నెస్ పరీక్షలు చేయించేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం రానుపోను 200 కిలోమీటర్లు ఆటోతో ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. అనివార్యకారణాలతో పరీక్ష వాయిదా పడితే ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆమెతో పాటు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ షేక్ సైదాబి

నాటుసారా నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి- పలాస

నాటుసారా నిర్మూలనకు కృషి చేద్దామని కాశీబుగ్గ ఎక్సైజ్ ఎస్ఐ షేక్ సైదాబి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు, పురుషోత్తంపురం గ్రామాల్లో గురువారం 2.0 నవ వసంతం కార్యక్రమంలో భాగంగా నాటుసారాపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటుసారా తాగడం ద్వారా ఆరోగ్యం పాడవుతుందన్నారు. ప్రభుత్వం నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గ్రామాల్లో నాటుసారా విక్రయాలు చేపట్టిన తయారు చేసిన అటువంటి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం అధికారులు హేమ శంకర్, మమత, మాధవరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

ఎక్సైజ్ వేధింపులు ఆపాలి

మందస: వ్యాపారస్తులపై ఎక్సైజ్ అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని మందస వర్తక సంఘం అధ్యక్షులు వడ్డీ గోపాలకృష్ణ కోరారు. ఈ మరకు డిప్యూటీ తహశీల్దార్ కె.రామకృష్ణను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో మేము కిరాణా షాపులు పెట్టుకొని జీవిస్తున్నామని అన్నారు. షాపుల్లో మేము ఎటువంటి చట్ట విరుద్ధమైన వస్తువులను అమ్మకాలు చేపట్టడం లేదని తెలిపారు. కానీ ఎక్సైజ్ పోలీసులు మమ్మలను పదేపదే సోంపేట, పలాస పోలీస్ స్టేషన్లకు పిలిపించి నాటుసారా తయారీకి అవసరమైన నల్లబెల్లం అమ్ముతున్నారని బెదిరిస్తున్నారని అన్నారు. అలాగే బైండోవర్ కేసు కడతామని చెబుతున్నారని అన్నారు. బెల్లం వ్యాపారం చేయడం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సభ్యులు మట్ట ధర్మారావు, కె.సురేష్, కె.మహేష్, శ్రవణ్, త్రినాథ్ పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

శ్రీకాకుళం అర్బన్: నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలిచేది ముఖ్యమంత్రి సహాయనిదని, వీటి ద్వారా ఎన్నో కుటుంబాలు సహాయం పొందుతున్నాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గార మండలం రామచంద్రపురానికి చెందిన గొలివి ప్రతాప్‌కు వైద్యం నిమిత్తం రూ.10 లక్షలు సిఎం సహాయనిధి నుంచి వచ్చిన ఎల్ఓసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కటుంబాలకు ఆర్థికంగా సహాయ పడేందుకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



బాధితుడు గొల్లకు చెక్కును అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బాధితునికి ఆర్థికసాయం

లావేరు: మండలంలోని గోవిందపురం పంచాయతీ లుకలాపుపేటకు చెందిన మీసాల గొల్ల గత పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మందులు కొనుగోలు చేసేందుకు, జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సహాయం చేస్తున్న హృదయాలు ఫౌండేషన్ సభ్యులు గురువారం లుకలాపుపేట వెళ్లి గొల్లకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు చెక్కును అందజేశారు. దీంతో గొల్ల ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన పదిమంది సహాయం చేస్తున్న హృదయాలు ఫౌండేషన్‌లో కొత్తగా సభ్యులుగా చేరారు. కార్యక్రమంలో అప్పలరాజు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మెళియాపుట్టి : మండలంలోని చాపర, జాడుపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం పర్యటించారు. చాపరకు చెందిన పడాల శ్రీను ఇటీవల అనారోగ్యం గురికావడంతో ఆయనను పరామర్శించారు. జాడుపల్లికి చెందిన కదంబల శంకరరావు అనారోగ్యం గురికావడంతో ఆయననూ పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతోపాటు మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రవ్వల గణపతిరావు, బొచ్చు ప్రసాదరావు, జాడిపల్లి ఎంపిటిసి కదంబల సుజాత పైడిరాజు, పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, దారపు దామోదర్ ఉన్నారు.

నైరాశ్యం వీడి నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిరుద్యోగ యువత నైరాశ్యం వీడి, సాంకేతిక రంగంలో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని వివిధ వృత్తుల్లో రాణించాలని ఎపి నైపుణ్యాభివృద్ధి అదనపు అధికారి డి.చంద్రమౌళి సూచించారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యాన నగరంలోని చైతన్య సహకార కళాశాలలో గురువారం యువత ఉపాధి కల్పన అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వాటిని సద్వినియోగపరచుకుని ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవాలన్నారు. జిల్లాలో 30 మండలాల్లో 30 శిక్షణా కేంద్రాలు ఉన్నాయని, నేషనల్ అకాడమీ ఫర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యాన నిర్మాణ రంగంలో శిక్షణ ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. అలాగే పదోతరగతి మొదలు ఉన్నత విద్య వరకు చదువుకున్న నిరుద్యోగ యువతకు నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళాలను నిర్వహించి అర్హత సాధించిన వారికి ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్ర విశ్వవిద్యాలయ పాలకమండలి మాజీ సభ్యులు జామి



మాట్లాడుతున్న చంద్రమౌళి

భీమశంకర్ మాట్లాడుతూ యువత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకుని విజయాలను అందుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథ నాయుడు, అంతర్జాతీయ విద్యా సంక్షేమ విభాగం చైర్మన్ హారికా ప్రసాద్‌లు క్లబ్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను వారు వివరించారు. కార్యక్రమంలో సెట్ శ్రీ సూపరింటెంట్ రేఖ, క్లబ్‌సభ్యులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, మణిశర్మ, క్లబ్ కార్యదర్శి తర్లాడ అప్పల నాయుడు, ఉపాధ్యక్షుడు పార్వతీశ్వరరావు, స్వచ్ఛంద సేవకురాలు మీసాల మాధవి, చైతన్య జూనియర్ కళాశాల డైరెక్టర్ రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

సోంపేట: బిరుసువాడలో అక్రమంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపాన్ని అడ్డుకోవాలని పలాసపురం సర్పంచ్, జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నిమ్మన దాసు అధ్యక్షతన గురువారం మండల సమావేశం నిర్వహించారు. కళ్యాణ మంపడం నిర్మాణానికి స్థానిక పంచాయతీ, సుడా అనుమతి ఇవ్వలేదన్నారు. 300 చదరపు మీటర్ల భవనానికి మాత్రమే పంచాయతీ అనుమతి ఇచ్చే హక్కు ఉందన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న సుమారు 1114 చదరపు మీటర్ల జఅని అన్నారు. అనుమతులు లేని భవనానికి విద్యుత్ కనెక్షన్ ఎలా ఇచ్చారని చెప్పాలని డిమాండ్ చేశారు. శివసాయి నగర్ లేఅవుట్ సుమారు 10 ఎకరాలు కాగా, నాలుగు ఎకరాల 95 సెంట్లు అనుమతులు తెచ్చి దాన్ని చూపించే పది ఎకరాలు ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్నారని అన్నారు. దానివల్ల



అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ జోగారావు

ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం తగ్గిపోతుందని సభ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పైడిగాం ఛానల్ మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, మాజీ ఎంపిపి మంగి గణపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నానాజీరావు

అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- గుజరాతీపేట

అక్రమ సస్పెండ్ రద్దు చేసి, కండక్టర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీరావు డిమాండ్ చేశారు. గురువారం శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో 1,2 డిపోల్లో గేటు మీటింగ్ ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస డిపోలో అన్యాయంగా సస్పెండ్ చేసిన కండక్టర్ నీలకంఠంను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. 1/19 సర్క్యులర్‌ను అధికారులు అమలు చేయడం లేదని, వారికి నచ్చినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. 2వ డిపో మేనేజర్ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని, అక్రమ చార్జి సీట్లు ఇస్తున్నారని, కెఎంపిఎల్‌పై వేధింపులు చేస్తున్నారన్నారు. ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు విడనాడాలని, సమస్యలు పరిష్కరించకపోతే ఎటువంటి పోరాటానికైనా సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమరావతి జెఎసి కార్యదర్శి ఎస్.వి.రమణ, శ్రీకాకుళం 2వ డిపో నాయకులు బి.రామకృష్ణ, కె.బాబురావు, బి.ఆనందరావు, ఎ.సింహాచలం, ఎస్.లక్ష్మణరావు, ఎస్ఎస్ నారాయణ, ఎస్.రమణ, పి.కె.రావు, ఎవిఆర్ మూర్తి పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలనలో రసాభాస

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో గురువారం నిర్వహించిన బిసి కార్పొరేషన్ రుణాలు మంజూరులో లబ్ధిదారులు దరఖాస్తులు పరిశీలన గందరగోళంగా మారింది. మున్సిపల్ అధికార యంత్రాంగం సరైనా ఏర్పాట్లు చేయకపోవడంలో లబ్ధిదారులు ఒక్కసారిగా కౌంటర్ల వద్ద గుమ్మిగూడారు. అన్ని బ్యాంకు అధికారులు రావాల్సిన, పరిశీలించాలిన కార్యక్రమానికి కొన్ని బ్యాంకుల నుంచి సమయానికి రాలేదు. దీంతో లబ్ధిదారులు ఏమి చేయాలో అర్థం కాక గందరగోళ పరిస్థితి నెలకొంది. కమిషనర్ ఎన్.రమేష్ జోక్యం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దే చర్యలు తీసుకున్నారు. చివరికి పురపాలక సంఘంలో బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో రుణాలు పొందేందుకు



కౌంటర్ వద్ద గుమిగూడిన లబ్ధిదారులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కార్యక్రమం క్రమ పద్ధతిలో నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో మొత్తం 486 దరఖాస్తులకు, 327 మంది లబ్ధిదారులు హాజరయ్యారు.

పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొద్దాం

కోటబొమ్మాళి: మండలంలో కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఒకప్పుడు 500 మంది విద్యార్థులతో కళకళ లాడేదని, వేర్వేరు కారణాలతో ఇప్పుడు కేవలం 200 మందికి పడిపోయిందని, మనమంతా ప్రజలకు అవగాహన కల్పించి ఈ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువద్దామని ఆ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థులను మళ్లీ పునరుద్ధరించడానికి అక్కడ ఉపాధ్యాయులు, విద్యా కమిటీ, స్థానిక యువత, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో చేయిచేయి కలిపి వినూత్నంగా భవిష్యత్ కోసం గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పిల్లల పేర్ల నమోదు కోసం ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టారు. ముఖ్యంగా షణ్ముఖ మాస్టర్ గైడెన్స్‌లో వినూత్నంగా పిల్లలచే మూడు భాషల్లో వివిధ కళా జాతాలు ప్రదర్శించి ప్రభుత్వ బడి గొప్పతనాన్ని వివరించారు. అలాగే



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నినాదాలతో హోరెత్తించారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు పిల్లల నమోదు కోసం పాటుపడుతున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. కె.అప్పలనాయుడు, రాము, గౌరి, గోపి, దుబ్బ సంతోష్, సింహాచలం, వెంకటరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

అన్నా క్యాంటీన్ ప్రాంతంలో పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను సందర్శించి ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న అన్నా క్యాంటీన్‌లో పేదలకు రుచికరమైన భోజనం, టిఫిన్‌ను అందజేస్తూ పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి తాగునీటిని అందు బాటులో ఉంచాలన్నారు. క్యాంటీన్‌లో ఉదయం అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్



అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు

భవనాలకు మోక్షమెప్పుడో?

- అసంపూర్తిగా నిలిచిన వైనం
- పాఠశాలల్లో అసౌకర్యం

ప్రజాశక్తి- టెక్కలి

గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు కొత్తరూపుకల్పిస్తామని, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేస్తామన్న ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాడు-నేడు భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. సుమారు రెండేళ్ల నుంచి పాఠశాలల పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. రెండో విడతలో మంజూరైన పాఠశాలల్లో మాత్రం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆ పనులూ నిలిచిపోవడంతో అప్పట్లో సరఫరా అయిన కొంత భవనం మెటీరియల్ మట్టి పాలయ్యాయి. భవనాల నిర్మాణాలూ చివరి దశకు చేరుకున్న తరుణంలో నిధులు మంజూరు కాకపోవడం, ఎన్నికల కోడ్ అమలు కావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాడు-నేడు కథకాన్ని మనఊరు మనబడి అని పేరు మార్చారు. అందుకు సంబందించిన భవనాలు పూర్తయ్యేందుకు నిధులు విడుదల కాకపోవడంతో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

టెక్కలి నియోజకవర్గం పరిదిలో కోటబొమ్మాళి మండలంలో నాలుగు అంగన్వాడీలు, 12 ప్రాథమిక పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 సెకండరీ పాఠశాలల భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నందిగాం మండలంలో ఏడు అంగన్వాడీలు, తొమ్మిది ప్రాథమిక, ఒకటి ప్రాథమికోన్నత, 12 సెకండరీ పాఠశాలల భవనాల పనులూ నిలిచిపోయాయి. సంతబొమ్మాళి మండలంలో ఒక అంగన్వాడీ, 21 ప్రాథమిక, 11 ప్రాథమికోన్నత, తొమ్మిది సెకండరీ పాఠశాలల భవనాలు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. టెక్కలి మండలంలో నాలుగు అంగన్వాడీ, 18 ప్రాథమిక, మూడు ప్రాథమి కోన్నత, పది సెకండరీ పాఠశాలలు భవనాల పనులు నిలిచి పోయాయి. ఇందుకు సంబంధించి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తుందో లేదో వేచిచూడాలి.



వృథాగా పడి ఉన్న భవన సామగ్రి

మంత్రి మాటకే విలువ లేదా?

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గతేడాది నవంబరు 30న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బోరుభద్ర నుంచి కె.లింగూడు వరకు రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో సంక్రాంతికల్లా ఎక్కడ గోతు కనిపించినా సంబంధిత కాంట్రాక్టరుపై, అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆయన మాటలకు విరుద్ధంగా ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టారని వాహనచోదకులు, తీర ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... బోరుభద్ర నుంచి వివేకానంద పాఠశాల వరకు మరమ్మతులు చేపట్టారు. అలాగే కె.లింగూడు నుంచి కొల్లిపాడు వరకు మాత్రమే మరమ్మతులు చేపట్టి మధ్యలో కొల్లిపాడు నుంచి వివేకానంద పాఠశాల వరకు మరమ్మతులు చేపట్టలేదు. ఆ రోడ్డుపైన ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఎంత నరకయాతన పడుతున్నా... అధికారులు, పాకులు



కొల్లిపాడు చెరువు వద్ద ఏర్పడిన గోతులు

పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రహదారి పెద్ద పెద్ద గోతులు ఉండడంతో తీర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గోతులు పూడ్చాలని తీర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు సిక్కోలు క్రీడాకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సిక్కోలు క్రీడాకారులు ఎంపికయ్యారని, ప్రతి క్రీడాకారుడు పతకంతో రావాలని చీఫ్ వెటరన్ డా. బడాన దేవభూషణ్ అన్నారు. రానున్న భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలిచి, బాడీ బిల్డింగ్‌కు పూర్వవైభవం తేవాలని, ఇప్పుడిప్పుడే సిక్కోలు బాడీ బిల్డర్స్ అదే తపనతో అడుగులు వేస్తుండటం హర్షణీయమన్నారు. ఈనెల 4న భీమవరంలో జరగనున్న బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా నుంచి పలువురు బాడీ బిల్డర్స్‌ను స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో గురువారం ఎంపిక చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షులు తారకేశ్వరరావు, కార్యదర్శి కె.గౌరీశంకర్ తెలిపారన్నారు. వారందరూ విజేతలుగా నిలిచి జిల్లా కీర్తిని ఇనుమడింప చేసి రాష్ట్రస్థాయిలో ఒకవెలుగు వెలగాలన్నారు. సీనియర్ బాడీ బిల్డర్ బి.విజయకుమార్ అన్ని విధాలుగా సహకారం



ఎంపికైన వారిని అభినందిస్తున్న దేవభూషణ్

అందిస్తున్నారన్నారు. 55 కేజీల విభాగంలో బి. అభి, వైకుంఠం, 60 కేజీల విభాగంలో ఎస్.బన్నీ, సుమంత్, 65 కేజీల విభాగంలో ఎం. రాంబాబు ఎంపికైన వారిలో ఉన్నారు. వారందరికీ ముందస్తు శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ బాడీ బిల్డర్ సందీప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

13న వాసుదేవరావు వర్ధంతి

పలాస: పలాసలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యాన ఈ నెల 13న శ్రీకాకుళం సాయుధ పోరాట యోధుడు పైల వాసుదేవరావు 15వ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అన్నారు. మండలంలోని బొడ్డపాడులో గురువారం వర్ధంతి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో అగ్ర నాయకుల్లో పైలా ఒకరని, ఉపాధ్యాయ వృత్తిని వదిలి ఉద్యమాల బాట పట్టారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాధవరావు, గొరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, పోతనపల్లి కుసుమ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

వ్యర్థాలతో సేంద్రీయ ఎరువులు

ప్రజాశక్తి- కవిటి

వ్యర్థాలతో వర్మీకంపోస్టు తయారుచేసి ఉద్యాన వన పంటలకు సేంద్రీయ ఎరువుగా వాడుకోవచ్చని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి అన్నారు. ఎస్‌డబ్ల్యూపిసి కార్యక్రమంలో భాగంగా గురువారం కవిటిలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. చెత్త సేకరణ బండి రోజూ ఇంటింటికీ వస్తుందని, దాన్ని ప్రజలు వినియోగించుకొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్రస్వామి, పిన్నింటి జయరావు, నూకరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో నిత్యం పలు ప్రాంతాల్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించి చర్యలు తీసుకుంటు న్నామని పట్టణ ఎస్ఐ ముకుందరావు తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో తరచూ నెలకొంటున్న ట్రాఫిక్ సమస్య ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో నేర నియంత్రణకు గట్టి నిఘా పెట్టామన్నారు. రాత్రి వేళల్లో ముమ్మ రంగా గస్తీ కొనసాగుతుందన్నారు. గంజాయి రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టామన్నారు.

విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని తొగరాం జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోట్‌పుస్తకాల పంపిణీతో తల్లిదండ్రులకు కొంత భారం తగ్గుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యువిఎన్ వర్మ, అధ్యాపకులు బి.గోవిందరావు, సిహెచ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలోని పట్టుశాలి కల్యాణ మండపంలో వైసిపి మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి తెలిపారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా శ్రీకాకుళం జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కిల్లి సత్యన్నారాయణ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఆర్థికసాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

మాజీ మంత్రి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మంచినీళ్లపేట సమీపం ఉన్న సముద్రంలో ఇటీవల తెప్ప బోల్తా ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. దీనిని స్థానిక వైసిపి నాయకులు గురువారం అందజేశారు. బాధిత కుటుంబాలతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిటిసి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయకుమార్, వైసిపి జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు తిర్రి రాజారావు, వైస్ ఎంపిపి వంక రాజు, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు కొమర దేవరాజు పాల్గొన్నారు.



వెండి వస్తువులు అందజేస్తున్న మోహనరావు, ఈశ్వరి

వెండి ఆభరణాలు వితరణ

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన స్టేట్ బ్యాంకు విశ్రాంత అసిస్టెంట్ మేనేజర్ దూళి మోహనరావు, ఈశ్వరిల వివాహ మహోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వెంకటేశ్వర ఆలయానికి వెండి ఆభరణాలను పూజారి కృష్ణమాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, అప్తలమిక్ వైద్యాధికారి ఐ.జానకిరామయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు భానోజీరావు, పొగిరి రవి పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న విజయ

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో ఎంపిటిసి మాజీ సభ్యులు గయా రత్నాలు బెహరా మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మృతుని కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, వైసిపి నియోజకవర్గం యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, కారింగి మోహనరావు, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్ యాదవ్, నీలాపు సారథిరెడ్డి, సాడి గురుమూర్తి, రెడ్డి కారింగి త్రినాథ్‌రెడ్డి, వైస్ సర్పంచ్ మురా బెహరా ఉన్నారు.

చెరువు ఆక్రమణల పరిశీలన

పలాస : పలాస ముత్యాలమ్మ కోనేరు ఆక్రమణలను అరికట్టాలని వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. ఈ మేరకు కోనేరు గట్టును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆవిర్భావం తరువాత జంట పట్టణాల ప్రజల సౌకర్యార్థం పార్కుగా తీర్చిదిద్ది 2005లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డితో నెహ్రూ పార్క్‌గా నామకరణం చేశారని అన్నారు. పార్కు చుట్టూ రిటర్నింగ్ వాల్ నిర్వహించాలని కోరారు.